క్లుప్తంగా

అమ్మవారి తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం



దుర్గి: ప్రసిద్ధిగాంచిన నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా మంళవారం ఆలయ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 24, 25 తేదీలలో జరుగు తిరునాళ్ల సందర్భంగా భక్తులకు సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ఆలయ డీసీ సహాయ కమిషనర్ సైదమ్మబాయి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖాధికారులు సహాయ సహకారాలందించి తిరునాళ్లను జయప్రదం చేయాలని కోరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశానుసారం అధికారులందరూ కలిసిరావాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఫణీంద్ర, అర్చకులు శేషాచార్యులు, విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్, రామయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి

పిడుగురాళ్ల: రైలు కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో శ్రీనివాసకాలనీ వద్ద వైఎస్సార్ విగ్రహ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ కరిముల్లా (20) ప్రమాదవశాత్తు రైలు కింద పడటంతో అతని రెండు కాళ్లు వేరయ్యాయి. విషయం తెలుసుకున్న బంధువులు హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు అవ్వలేదని పోలీసులు తెలిపారు.

లంబాడీ హక్కుల సాధన కోసం నిరాహార దీక్ష

విజయపురిసౌత్: లంబాడీ హక్కుల సాధన కోసం రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు ధానావత్ సైదానాయక్ ఆధ్వర్యంలో మాచర్ల మండలం పెద్ద అనుపు చెంచుకాలనీలో మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సైదానాయక్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నూతన రాష్ట్రంగా ఏర్పడి 10 సంవత్సరాలు అవుతున్నా శాసనసభ, పార్లమెంట్ సీట్లలో ఒక్క సీటు కూడా రిజర్వేషన్ ప్రకారం సుగాలీలకు కేటాయించలేదని విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవి సుగాలీలకు కేటాయించాలని, 2030 వరకు ఉన్న రిజర్వేషన్ కాలాన్ని 2060 వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. సుగాలీలు లంబాడీ హక్కుల సాధక కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో లాలూనాయక్, లష్కర్‌నాయక్, గోపీనాయక్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో పోలీస్ కవాత్



పిడుగురాళ్ల: పోలీస్ కవాత్ కార్యక్రమం జిల్లా అడిషనల్ ఎస్పీ, గురజాల డీఎస్పీల ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా పట్టణంలో పోలీస్ కవాత్ నిర్వహించారు. ఈ కవాత్‌లో పోలీసులు తుపాకీలు చేతపట్టి, బులెట్ ప్రూఫ్ యూనిఫాం ధరించి, లాఠీలు పట్టుకొని క్రమశిక్షణగా పాల్గొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి పురవీధుల్లో ఈ పోలీస్ కవాత్ జరిగింది. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామచంద్రరావు, గురజాల డీఎస్పీ పల్లపు రాజు, పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, పట్టణ ఎస్ఐలు పఠాన్ రబ్బాని ఖాన్, అమీర్, సీఆర్పీఎఫ్ బలగాలు, ఏఎస్ఎస్ పార్టీ, పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విజయపురిసౌత్ పాత కమిటీ రద్దు

జిల్లా ఎంఎస్పీ ప్రధాన కార్యదర్శి జోసఫ్ బాబు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ విజయపురి సౌత్ ఎమ్మార్పీఎస్ పాత కమిటీ రద్దయినట్లు పల్నాడు జిల్లా ఎంఎస్పీ ప్రధాన కార్యదర్శి పలుకూరి జోసఫ్ బాబు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక పార్క్ సెంటర్ వద్ద మీడియా సమావేశంలో మాట్లాడారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు త్వరలోనే ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీలను ప్రకటిస్తామన్నారు. అప్పటివరకు గతంలో ఉన్న పాత కమిటీలు పూర్తిగా రద్దు అయ్యాయన్నారు. ఎవరైనా ఎమ్మార్పీఎస్ లేదా ఎంఎస్పీ నాయకులమంటూ పత్రిక ప్రకటనలు చేసినా, అనధికారికంగా చెప్పుకుంటూ తిరిగినా వారిపై మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కఠిన చర్యలు ఉంటాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరూ సదరు విషయాన్ని గమనించాలని కోరారు. మీడియా సమావేశంలో గురజాల నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మాతంగి సత్యానందం మాదిగ, కుమార్ మాదిగ, మీసాల బాబు మాదిగ ఉన్నారు.

సామాజిక సమానత్వానికి సజీవ సాక్ష్యాలు

- ఫంక్షన్ హాళ్లుగా సామాజిక భవనాలు
- గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు కృషి
- అన్ని వర్గాల వారికి అందుబాటులోకి



జంగమహేశ్వరపురంలోని కమ్యూనిటీ హాల్

గురజాల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక సమానత్వానికి నిలువుటద్దాలుగా నిలిచేలా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాళ్లు ఎంతో ప్రయోజనకరంగా మారాయి. కులం, మతం, వర్గం, ప్రాంతం చూడకుండా అందరికీ సౌకర్యవంతంగా ఉండేలా నియోజకవర్గ వ్యాప్తంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ ఆయా వర్గాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి కులానికి వారి ప్రాంతంలో ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో రూ.7.50 కోట్ల ఖర్చుతో 66 కమ్యూనిటీ హాల్స్ నిర్మించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు పెద్దపీట వేస్తూ ఈ హాళ్ల నిర్మాణం గురజాల చరిత్రలో నిలిచిపోయేలా చేపట్టారు. గతంలో పేదలు ఏమైనా శుభకార్యాలు చేసుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ప్రైవేట్ కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌కు అద్దెలు భరించలేక ఇబ్బందులు పడేవారు. నడిరోడ్లపై చేసుకోవాల్సిన దుస్థితి ఉండేది. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ సామరస్యాన్ని పెంపొందించేలా ఉన్నాయి. ఆయా కులాల వారీగా నిర్మించిన కమ్యూనిటీ హాల్స్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం తమకు ఆర్థిక భారం తగ్గించిందని అంటున్నారు. వీటిని నిర్మించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నియోజకవర్గంలో ఇలా...

గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాచేపల్లి, గురజాల, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో 66 కమ్యూనిటీ హాల్‌లు నిర్మాణం చేపట్టారు. అందుకుగాను 7.42 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారు. ఇప్పటికి 28 కమ్యూనిటీ హాల్‌లు నిర్మాణాలు పూర్తి కాగా, 9 కమ్యూనిటీ హాళ్లు చివరిదశకు చేరుకున్నాయి. 29 కమ్యూనిటీ హాల్స్ పనులు ప్రారంభించారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి ఆయా వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా ఎమ్మెల్యే కాసు చర్యలు చేపట్టారు. బ్రాహ్మణులకు, యాదవులకు కమ్యూనిటీ హాలు నిర్మాణం కొరకు గురజాలలో స్థలం సేకరించి ఆ కుల సంఘాల పెద్దలకు అందించారు.

మండలం	ఎస్సీ	ఎస్టీ	బీసీ	ఓసీ/జనరల్
గురజాల	6	0	3	5
దాచేపల్లి	6	0	2	7
మాచవరం	8	0	3	4
పిడుగురాళ్ల	12	1	5	4
మొత్తం	32	1	13	20

సీఎం జగన్‌కు, కాసు మహేష్‌రెడ్డికి రుణపడి ఉంటాం...



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మా సంఘంలోని సభ్యులు, ప్రజలు అందరం రుణపడి ఉంటాం. మా కాలనీలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్‌లో మేము శుభకార్యాలు, ఫంక్షన్‌లు చేసుకుంటున్నాం. గతంలో రోడ్లపై స్టేజీలు కట్టుకుని ఫంక్షన్ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. హుందాగా కమ్యూనిటీ హాల్‌లో చేసుకుంటున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– చౌటూరి వెంకటేశ్వర్లు, 7వ వార్డు కౌన్సిలర్

ఎంతో ఆనందంగా ఉంది...



మా కాలనీలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉంది. పెళ్లిళ్లు ఆ ఫంక్షన్ హాల్‌లోనే జరుపుకుంటున్నాం. కులమతాలకతీతంగా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచడం మంచి పరిణామంగా భావిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధి బాగుంది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అభివృద్ధికి దోహదపడుతున్నారు.

– చలంచర్ల రోశమ్మ, జంగమహేశ్వరపురం

శాశ్వతంగా గుర్తుండిపోయేలా...



మనం చేసిన సేవలు మనకు గుర్తింపునిస్తాయి. పేదల సంక్షేమం, అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తూ పనిచేసాను. ఐదేళ్ల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా గురజాల నియోజకవర్గంలో కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేసి ఆయా వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంచాం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 66 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేపట్టడం జరిగింది. ఇక నుంచి ఆయా సామాజిక వర్గాలకు చెందిన వారు ఆ కమ్యూనిటీ హాల్‌లో ఉచితంగా శుభకార్యాలు చేసుకోవచ్చు. సామాజిక కమ్యూనిటీ భవనాలు శాశ్వతంగా చరిత్రలో గుర్తిండిపోతాయి.

– ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

రైతు బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- రూ.4.5 కోట్ల వ్యయంతో మిర్యాలలో సబ్ స్టేషన్ ప్రారంభం
- రూ.5 కోట్లతో కారెంపూడిలో విద్యుత్ పనులకు శ్రీకారం
- రూ.2 కోట్లతో దుర్గిలో విద్యుత్ పనులకు శంకుస్థాపన
- పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



కారెంపూడిలో విద్యుత్ పనుల నిమిత్తం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: పల్నాడు ప్రాంతంలో బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతాంగానికి నిరంతరం ఉచిత విద్యుత్ అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం దుర్గి, కారెంపూడి మండలాల్లో ఆయన పాల్గొని పలు ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. రూ.2 కోట్లతో దుర్గి గ్రామంలో 11కేవీ/ఎల్‌టీ లైన్లు పునర్నిర్మాణ విద్యుత్ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. రూ.4.5 కోట్ల వ్యయంతో నిర్మించిన కారెంపూడి మండలంలోని మిర్యాలలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. కారెంపూడిలో రూ.5 కోట్లతో 11 కేవీ/ఎల్‌టీ లైన్లు పూర్తిస్థాయిలో విద్యుత్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు లో ఓల్టేజి లేకుండా సబ్ స్టేషన్ నిర్మించామని, 9 గంటల ఉచిత విద్యుత్ పగటి పూట అందించి రైతాంగ అభివృద్ధికి మన ప్రభుత్వం పాటు పడుతుందన్నారు. అంతరాయం లేని నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరాకు, గృహ, వాణిజ్య వినియోగదారులకు లో ఓల్టేజి సమస్య లేకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు, జెడ్పీటీసీలు శెట్టిపల్లి యలమంద, షేక్ షఫి, సర్పంచ్‌లు కొండలు, రాయపాటి మాణిక్యం, పార్టీ కన్వీనర్లు ఉన్నం పెద్దబ్బాయ్, సుబ్రహ్మణ్యం, దుర్గి మండల యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వెలిదండి గోపాల్, బొమ్మిన అల్లయ్య, కటకం చిన వెంకటయ్య, ఎంపీటీసీ కటకం గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ కటకం రామారావు, జంగా కొండలు, చింతా నరసింహారావు, తోటకూర నాగేశ్వరరావు, గొంది నాసరయ్య, ఏడీఈ ఎ.రామయ్య, షేక్ అక్బర్, చంద్రశేఖర్, గురవారెడ్డి, రామారావు, తేజానాయక్, బాజి, వెంకట్రామయ్య, సూర్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



మిర్యాలలో సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే



గన్నవరం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, తదితరులు

రైతన్నలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

మాచర్ల రూరల్: నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందిస్తూ లో ఓల్టేజి సమస్యను నివారించి రైతులకు మేలైన, నాణ్యమైన కరెంట్‌ను సరఫరా చేసేందుకు కోట్లాది రూపాయలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సబ్ స్టేషన్‌లను నిర్మించిందని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గన్నవరం గ్రామంలో రూ.4.5 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో లో ఓల్టేజి సమస్యను పరిష్కరించి రైతన్నలకు సకాలంలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నియోజకవర్గంలో రూ.38 కోట్లతో 10 విద్యుత్ సబ్‌స్టేషన్‌లను నిర్మించి నేడు ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌కే సాధ్యమైందని చెప్పారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో విద్యుత్ బోర్లపై వ్యవసాయం చేసే రైతన్నల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలను అందించేందుకు వైఎస్సార్ సీపీకి ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మండ్లి మల్లుస్వామి, మండల పార్టీ అధ్యక్షులు అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి కోటిరెడ్డి, ఎంపీటీసీ డి.సాంబశివారెడ్డి, సర్పంచ్ ఓర్సు లక్ష్మీ, మున్నా పాపయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కందుల శివారెడ్డి, పిన్నెల్లి రామ్మోహనరెడ్డి, తాతిరెడ్డి బ్రహ్మారెడ్డి, గొలమారి మట్టారెడ్డి, వీరయ్య, ఆరికట్ల చంద్రారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు, డీఈఈ ఎ.రామయ్య, ఏఈ ఎం.రాంబాబు, కాంట్రాక్టర్ బాల బాదరయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ముప్పాళ్ల: పురుగు మందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని తొండపి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన వల్లెపు గోపి (24) సత్తెనపల్లిలోని ఒక ప్రయివేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత నెల 29న ఇంటి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడాన్ని గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జరిగిన ఘటనపై ఏఎస్ఐ ఇమామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులు ప్రశాంతంగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న పరాశక్తి వైస్ ప్రెసిడెంట్ రాజు

సత్రశాల(రెంటచింతల): స్థానిక పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులు ప్రశాంతమైన మనస్సుతో విధులకు వచ్చి ప్రతి ఒక్కరూ సురక్షితమైన భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించడం వలన ఇప్పటి వరకు ఒక్క ప్రమాదం కూడా జరగలేదని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆవరణలో మంగళవారం 53వ జాతీయ భద్రతా వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్మికులు యాజమాన్యానికి సహకరించి ఫ్యాక్టరీ అభివృద్ధికి 100 శాతం కృషిచేయడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి కార్మికుడు అప్రమత్తంగా ఉండాలని ఏ చిన్న పొరపాటు జరిగిన భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ముందుగా ఆయన కార్మికులతో కలిసి భద్రతా జండాను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్మికులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఎం ఎం.రామకృష్ణారెడ్డి, సీనియర్ డీజీఎం ఎ.వెంకట్రావ్, డీజీఎం వీఎల్ గణపతి రాజు, డీజీఎం జి.మల్లిఖార్జునరావు, సేఫ్టీ ఆఫీసర్ డి.నాగరాజు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్స్ బహూకరణ



మాచర్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ మాచర్ల పల్నాడు వారి ఆధ్వర్యంలో పట్టణంలోని అజాద్ నగర్ మండల పరిషత్ పాఠశాలకు రెండు టేబుళ్లు విరాళంగా ఇవ్వటం సంతోషకరమని అధ్యక్షుడు మద్ది హరికిరణ్, క్యాబినెట్ గెస్ట్ గవర్నర్ చుండూరు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని అజాద్‌నగర్‌లో ఉన్న పాఠశాలకు టేబుల్స్ అందించి మాట్లాడారు. దాతలు పోలా చిన సత్యనారాయణ, కంభంపాటి ప్రకాష్‌లు ఈ బహుమతులు అందించటం ఆనందదాయకమన్నారు. పాస్ట్ ప్రెసిడెంట్ అల్లం కోటిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం పట్టాభి, ఉపాధ్యాయులు, రిటైర్డ్ హెచ్ఎం ముత్యాల పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వడియరాజులు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాసు

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని గుత్తికొండ గ్రామంలో టీడీపీకి చెందిన పలువురు వడియరాజులు మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కాసు వారికి వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంలో వడియరాజులకు ఎంతో ప్రాముఖ్యతనిచ్చి వారికి సముచిత స్థానం కల్పించారు. చంద్రగిరి ఏసురత్నంను ఎమ్మెల్సీని చేశారన్నారు. పిడుగురాళ్లలో మార్కెట్ యార్డు చైర్మన్‌గా కొమెర వెంకటేశ్వర్లుకు అవకాశం కల్పించారన్నారు. అలాగే దేవళ్ల రేవతికి వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారని తెలిపారు. అంతేకాక వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో బత్తుల వెంకటేశ్వర్లు, బత్తుల కోటేశ్వరమ్మ, బత్తుల కొండ, బత్తుల దుర్గా ప్రసాద్, బత్తుల నాగరాజు, బత్తుల రమణ, బత్తుల కుమారి, బత్తుల పుష్పతో పాటు పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బండ్ల రామారావు, నలబోలు రామారావు, కావూరి ఆంజనేయలు, బండారు దావీదు, కందులూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న కేసీపీ అధికారులు, ఉద్యోగులు, మహిళలు

మాచర్ల: పట్టణంలోని లక్షల రూపాయలతో నిర్మించిన కేసీపీ సంస్థ ప్రాంగణంలోని వినాయకుని దేవాలయ 13వ వార్షికోత్సవ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే అర్చకులు వంశీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా జనరల్ మేనేజర్ వి.వెంకట రమణ, డీజీఎం రామ కోటేశ్వరరావు, హెచ్ఆర్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, హెచ్ఆర్ మేనేజర్‌లు ఆనందరెడ్డి, కొండలు, శేషరాజు, నాగేశ్వరరావు, మహేష్ ప్రసాద్, కిడ్స్ పాఠశాల హెచ్ఎం రామకృష్ణ శాస్త్రి, యూనియన్ నాయకుడు జీఎల్ నారాయణ, కె.శ్రీనివాసరెడ్డి, శివయ్యల ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహం ముందు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసీపీ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

షాదీఖానా నిర్మాణంతో ముస్లింల కష్టాలకు చెక్

- రూ.40 లక్షలతో షాదీఖానా 2వ అంతస్తు నిర్మాణం
- పూర్తయిన నిర్మాణ పనులు



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న షాదీఖానా రెండవ అంతస్తు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో ఉన్న షాదీఖానా ముస్లింలకు సరిపోక ఇబ్బందులు పడుతున్న తరుణంలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వెంటనే షాదీఖానా రెండవ అంతస్తు నిర్మించేందుకు నిధులు అందించడంతో శరవేగంగా షాదీఖానా రెండవ అంతస్తు నిర్మణ పనులు పూర్తిచేశారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభిచేందుకు సర్వం సిద్ధం చేశారు. అడిగిన వెంటనే ఎమ్మెల్యే నిధులు అందించినందుకు పట్టణంలోని ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు జనాభా పెరుగుతుండటంతో ఉన్న షాదీఖానా సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు పై అంతస్తు నిర్మాణం పూర్తవడంతో ముస్లిం సోదరుల శుభకార్యాలకు సౌకర్యవంతంగా ఉంటుంది. గత పాలకులు నిర్మాణం చేపడతామని మాయమాటలు చెప్పి కాలయాపన చేశారు. నేడు అడిగిన వెంటనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటనే నిధులు అందించి చకచకా నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

రూ.40 లక్షల మంజూరుకావటం ఇదే ప్రథమం...

గత పాలకుల హయాంలో విడతల వారీగా కొన్ని సంవత్సరాల పాటు షాదీఖానా నిర్మాణం జరిగింది. కానీ వైఎస్సార్‌సీపీ హయాంలో షాదీఖానా సరిపోవటం లేదని ముస్లిం మత పెద్ద, అంజుమన్ కమిటీ చైర్మన్ ఎండీ ఉస్మాన్ మేస్త్రీతోపాటు ముస్లిం సోదరులు సమస్యను ఎమ్మెల్యేను కలిసి వివరించటంతో స్పందించిన ఆయన తక్షణమే రూ.40 లక్షల గ్రాంట్ మంజూరు చేయించారు. అడిగిన వెంటనే గ్రాంట్‌ను అందజేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ముస్లిం సోదరులందరు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

డబ్ల్యూహెచ్‌వో బృందం సభ్యుడు నరసింహారావు



టీకాలపై విచారిస్తున్న డబ్ల్యూహెచ్‌వో బృందం సభ్యుడు నరసింహారావు, డాక్టర్ అమరేశ్వరరెడ్డి

పిడుగురాళ్ల: ప్రజలు తమ పరిసరాలను ఎంత శుభ్రంగా ఉంచుకుంటే అంత ఆరోగ్యంగా ఉంటారని డబ్ల్యూహెచ్‌వో బృందం సభ్యుడు నరసింహారావు అన్నారు. పట్టణంలోని ఎల్ఐసీ కృష్ణారావు బజార్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం పట్టణంలోని సుందరయ్య కాలనీ, వడ్డెర కాలనీ, పీడబ్ల్యూ కాలనీలను సందర్శించారు. చిన్నారులకు వేసిన టీకాలపై చిన్నారుల తల్లులతో మాట్లాడి వైద్య సిబ్బంది వైద్య సేవలు ఎలా అందిస్తున్నారనే విషయంపై విచారించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం నాణ్యమైన వైద్యం అందిస్తుంది. ప్రజలకు వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలి. అలాగే ప్రజలు తమ పరిసరాలతో పాటు తమ చుట్టు పక్కల ప్రాంతాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చిన్నారులు తరచూ అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యులను సందర్శించి వైద్య సేవలు పొందాలని వివరించారు. చిన్నారులకు వైద్యులు చెప్పిన విధంగా క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. అలాగే వైద్య సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అమరేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ విజయకుమారి, ఏఎన్ఎం స్వర్ణలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గురజాల : పురుగుమందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మాడుగుల గ్రామానికి చెందిన బండ్ల నారాయణ (38) అప్పుల బాధ తాళలేక ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. తనకున్న రెండు ఎకరాలతో పాటు మరొక పది ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిరప సాగు చేశాడు. వర్షాలు సమృద్ధిగా కురవక పోవడంతో పెట్టిన పెట్టుబడి రాక అప్పులు పెరిగిపోయాయి. గత కొద్ది రోజులుగా అప్పులు ఎలా తీర్చాలనే ఆవేదనతో ఉంటున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. విషయాన్ని గమనించిన బంధువులు తలుపులు పగులగొట్టి గురజాల వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల వైద్యశాలకు తరలించారు. బండ్ల నారాయణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. నారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, కొమ్మినేని బుజ్జి, కొమ్మినేని రవిశంకర్, కావూరి అంజిబాబు, సిద్దాడపు గాంధీ, మురారి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.